క్లుప్తంగా

## వైభవంగా రేణుకా ఎల్లమ్మ విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవం



ఎమ్మెల్యే, నాయకులను సన్మానిస్తున్న ఆలయ నిర్వాహకులు

**షాద్‌నగర్:** పట్టణంలోని పరిగి రోడ్డులో కల్లు డిపో వద్ద గౌడ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రేణుకాఎల్లమ్మ తల్లి ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు బుధవారం వైభవంగా జరిగాయి. ఈ సందర్భంగా ఆలయంలో నిర్వహించిన కార్యక్రమాలకు ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ హాజరై అమ్మవారికి పూజలు చేసి తీర్థప్రసాదాలు స్వీకరించారు. అనంతరం ఎమ్మెల్యేను ఆలయ నిర్వాహకులు శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో నాయకులు విశ్వం, కొంకళ్ల చెన్నయ్య, చెంది తిరుపతిరెడ్డి, బాల్‌రాజుగౌడ్, కృష్ణారెడ్డి, వన్నాడ ప్రకాశ్‌గౌడ్, కట్టా వెంకటేశ్‌గౌడ్, కుమారస్వామి, శ్రీనివాస్‌గౌడ్, రవి, శ్రీనివాస్‌గౌడ్, మల్లేశ్, లక్ష్మణ్, సందీప్, శ్రీనివాస్, గోవర్ధన్‌గౌడ్, వన్నాడ వెంకటేశ్‌గౌడ్, నవీన్‌గౌడ్, అంజయ్య, సత్యనారాయణ, రాములు తదితరులు పాల్గొన్నారు.

## దేవాలయ నిర్మాణానికి విరాళం



ఆలయ కమిటీ సభ్యులకు నగదు అందజేస్తున్న దాతలు

**షాద్‌నగర్:** మండల పరిధిలోని మొగిలిగిద్ద గ్రామంలో నూతనంగా ఆంజనేయస్వామి దేవాలయాన్ని నిర్మిస్తున్నారు. ఆలయంలోని గర్భగుడిలో గ్రానైట్ వేసేందుకు గ్రామానికి చెందిన విశ్రాంత ఎస్‌ఐ క్రీ.శే పిల్లి బాలయ్య కుమారులు సురేశ్‌బాబు, జగన్, శివకుమార్, బాలకృష్ణలు బుధవారం రూ.65వేల విరాళాన్ని ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు కక్కునూరి వెంకటేశ్‌గుప్తా, అన్మారి వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

## రహదారిపై గుంతల పూడ్చివేత



గుంతలను పూడ్చివేయిస్తున్న దాతలు

**చేవెళ్ల:** మండలంలోని హైదరాబాద్–బీజాపూర్ జాతీయ రహదారిపై వర్షాలకు ఏర్పడిన గుంతలను దాతలు పూడ్చివేయించారు. బుధవారం చేవెళ్లకు చెందిన పలువురు దాతలు గుత్తి మల్లేశ్, బండారి శ్రీకాంత్ రెడ్డి, ఎం.నరేశ్ ముందుకు వచ్చి రెడిమిక్స్ ట్యాంకర్‌తో ఈ గుంతలను పూడ్చివేయించే పనులు చేపట్టారు. హైదరాబాద్–బీజాపూర్ జాతీయ రహదారిపై వికారాబాద్ వైపు వెళ్లే దారిలో అనేక గుంతలు పడి వాహనదారులకు తీవ్ర ఇబ్బందిగా మారింది. ఈ గుంతలను పూడ్చాలని పలువురు వాహనదారులు సోషల్ మీడియాలో బుధవారం విన్నవించడంతో చేవెళ్లకు చెందిన దాతలు ముందుకు వచ్చి రోడ్డుపై ఏర్పడిన గుంతలను పూడ్చివేశారు. దాతలను ప్రయాణికులు, వాహనదారులు అభినందించారు.

## క్రమశిక్షణతో ముందుకుసాగాలి

**మొయినాబాద్‌రూరల్:** విద్యార్థులు ఎంచుకున్న లక్ష్యం దిశగా క్రమశిక్షణతో ముందుకు సాగినప్పుడే బంగారు భవిష్యత్ ఉంటుందని చైతన్య డీమ్డ్ టూబీ యూనివర్సిటీ కులపతి డాక్టర్ సీ.హెచ్.వి.పురుషోత్తంరెడ్డి పేర్కొన్నారు. బుధవారం మండల పరిధిలోని హిమాయత్‌నగర్ సమీపంలో గల చైతన్య డీమ్డ్ టూబీ యూనివర్సిటీ కళాశాలలో ఓరియంటేషన్ డే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పురుషోత్తంరెడ్డి పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించి మాట్లాడుతూ.. కళాశాలలో అందిస్తున్న బోధనను క్రమశిక్షణతో అలవర్చుకున్నప్పుడే ఉజ్వల భవిష్యత్ ఉంటుందని తెలిపారు. ఉన్నత విద్యలో ప్రస్తుత సమాజంలో పోటీతత్వం ఎంతో పెరిగిందని, పోటీతత్వానికి దీటుగా ముందుకెళ్లాలని తెలిపారు. ప్రతి రోజు పరిశోధనలతో నూతన విద్య నేర్చుకోవాలని సూచించారు. కార్యక్రమంలో యూనివర్సిటీ వైస్ ప్రెసిడెంట్ విక్రమ్‌రెడ్డి, ఉప కులపతి ప్రొఫెసర్ గుర్రపు దామోదర్, చీఫ్ అడ్మినిస్ట్రేటివ్ అధికారి సాత్వికరెడ్డి, రిజిస్ట్రార్ ఆచార్య రవీందర్, ఓఎస్‌డీ డాక్టర్ వీర వెంకటయ్య, డీన్ ప్రొఫెసర్ జి.శంకర్‌లింగం, ప్రొఫెసర్ కవిత, ఆర్.కిష్టఫర్, సైన్స్ ప్రొఫెసర్ సుందర్‌రామ్, పబ్లిక్ రిలేషన్ అధికారి గాదె రాంబాబు, విద్యార్థులు పాల్గొన్నారు.

# క్షణక్షణం.. భయం.. భయం

● శిథిలావస్థలో మండల మహిళా సమాఖ్య భవనం ● ఇబ్బందులు పడుతున్న సంఘాల సభ్యులు ● పట్టించుకోని అధికారులు



శిథిలావస్థలో నందిగామ మండల మహిళా సమాఖ్య భవనం



స్థలం లేకపోవడంతో కింద కూర్చున్న మహిళా సభ్యులు

**నందిగామ:** ఆ సంఘం జాతీయ స్థాయిలో ‘జాతీయ ఉత్తమ సమాఖ్య’ సంఘంగా అవార్డు అందుకుంది. రూ.కోట్లలో లావాదేవీలు కొనసాగుతుంటాయి. ఎన్నో మహిళా సంఘాలకు, సంఘ సభ్యులకు ఉపాధి చూపిస్తున్న మహిళా సమాఖ్య పేరు గొప్ప.. ఊరు దిబ్బ అన్న చందంగా మారింది నందిగామ మండల మహిళా సమాఖ్య భవనం దుస్థితి.

**సొంత భవనం లేక ఇబ్బంది..**

మండల కేంద్రమైన నందిగామలో ఉన్న మండల మహిళా సమాఖ్యకు సొంత భవనం లేకపోవడంతో గ్రామ మహిళా సంఘ భవనంలో కొనసాగుతోంది. గత ప్రభుత్వంలో కొత్తూరు మండలం నుంచి విడిపోయి నందిగామను మండల కేంద్రముగా ఏర్పాటు చేయడంతో పలు భవనాలకు సొంత భవనాలు కరువయ్యాయి.

**సంఘంలో రూ.కోట్లలో లావాదేవీలు..**

మండల మహిళా సమాఖ్యలో మండల వ్యాప్తంగా 585 మహిళా సంఘాలు ఉండగా అందులో 6417 మంది సభ్యులు ఉన్నారు. అందులో ఎస్సీ 101 సంఘాలు ఉండగా అందులో 1115 మంది సభ్యులు, ఎస్టీ సంఘాలు 35 ఉండగా 417 మంది సభ్యులు, బీసీ సంఘాలు 397 ఉండగా 4085 మంది సభ్యులు, మైనార్టీ సంఘాలు 36 ఉండగా 533 మంది సభ్యులు, ఇతరులు 36 సంఘాలు ఉండగా 533 మంది సభ్యులు ఉన్నారు. ఈ సమాఖ్యలో అన్ని సంఘాలకు గతేడాది రూ.22 కోట్లు రుణాలు ఇవ్వగా, ఈ ఏడాది 23 కోట్లు రుణాలుగా ఇవ్వాలని టార్గెట్‌గా ఉంది. ఇప్పటికే దాదాపుగా టార్గెట్ పూర్తి కావాల్సి వచ్చింది. ఈ రుణాలలో ఎంతో మంది మహిళా సంఘం సభ్యులు రుణాలు తీసుకొని స్వయం ఉపాధి పొందుతూ తిరిగి చెల్లిస్తున్నారు. దీంతో మండల మహిళా సంఘం జాతీయ స్థాయిలో గుర్తింపు పొందింది. ఈ సమాఖ్య పురోగతిని గుర్తించిన కేంద్ర ప్రభుత్వం 2022లో జాతీయ ఉత్తమ సమాఖ్య అవార్డుకు ఎంపిక చేసింది. మహిళా దినోత్సవం సందర్భంగా న్యూఢిల్లీలోని విజ్ఞాన్ భవన్‌లో అవార్డు అందుకున్నారు.

**ప్రస్తుత పరిస్థితి..**

మండల మహిళా సమాఖ్యకు మండలంలోని పలు గ్రామాల నుంచి అనునిత్యం పలు పనుల నిమిత్తం 100 నుంచి 150 మంది మహిళలు రాకపోకలు కొనసాగిస్తుంటారు. ఆ భవనంలో కేవలం ఒక హాలు మాత్రమే ఉండగా, ఒక చిన్న సందులాంటి గదిలో ఫైళ్లు, కంప్యూటర్ తదితర వాటకి ఉపయోగిస్తుంటారు. ఇందులో కూర్చోవడానికి ఏ మాత్రం వీలు లేకుండా ఉంది. పది మంది మహిళలు ఉన్నారంటే మరికొంత మంది బయట వేచి ఉండాల్సిన పరిస్థితి నెలకొంది. ప్రస్తుతం ఆ భవనం పూర్తిగా శిథిలావస్థకు చేరుకుంది. ఏ మాత్రం వర్షం వచ్చిందంటే చాలు పెక్కులు ఊడిపోవడం, స్లాబ్ నుంచి నీరు కిందికిపడుతున్నాయి. దీంతో ఆ భవనంలో ఎప్పుడు ఏ ప్రమాదం చోటు చేసుకుంటుందో తెలియని పరిస్థితి. వర్షం వస్తే బిల్డింగ్ పైన టార్పాలిన్‌ను కప్పారంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు.

**సమస్యలు ఇవీ..**

- మహిళా సభ్యులకు కనీసం వాష్ రూం లేక ఇబ్బందులు పడుతున్నారు. దీంతో తప్పని పరిస్థితిల్లో సమీపంలో ఉన్న పాఠశాల బాత్‌రూంలను వాడుకుంటున్నారు.
- గ్రామ సంఘాల సభ్యులతో సమావేశం ఏర్పాటు చేయాలంటే చెట్ల కింద సమావేశం ఏర్పాటు చేయాల్సిన పరిస్థితి
- శిథిలావస్థకు చేరిన భవనంలో నుంచి వర్షం వచ్చిందంటే చాలు ఊరుస్తుంది. దీంతో కంప్యూటర్, ఫైళ్లు తడిసిపోతున్నాయి.
- భవనం పూర్తిగా శిథిలావస్థకు చేరుకోవడంతో ఏ క్షణంలో పెచ్చులూడి పడిపోతాయో తెలియని పరిస్థితి.
- ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి మహిళా సంఘాల సభ్యులు ఎదుర్కొంటున్న సమస్యలను దృష్టిలో పెట్టుకొని సొంత భవనం నిర్మించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

**సొంత భవనం నిర్మించాలి..**



మండల మహిళా సమాఖ్య భవనాన్ని వీలైనంత త్వరగా మంజూరు చేసి నిర్మించాలి. మహిళా సంఘాల సభ్యులతో కనీసం సమావేశం ఏర్పాటు చేసుకునేందుకు అవకాశం లేదు. శిథిలావస్థకు చేరిన భవనంలో ఎప్పుడు ఎం జరుగుతుందో తెలియని పరిస్థితి. వర్షం వస్తే ఊరుస్తుంది, పెచ్చులూడిపోతున్నాయి.

\- యాదగిరి, ఏపీఎం, నందిగామ

**కనీస వసతులు లేవు**



గ్రామాల నుంచి అనునిత్యం ఎంతో మంది మహిళా సభ్యులు మండల సమాఖ్యకు వస్తుంటారు. కనీసం వాష్ రూం లేక పోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. అంతేకాకుండా ఇరుకుగా ఉన్న గదిలో ఉండలేకపోతున్నాం. ఏ మాత్రం పది మంది ఉన్నారంటే ఆరు బయట, చెట్ల కింద కూర్చోవాల్సిన పరిస్థితి. సొంత భవనం నిర్మించాలి.

\- అరుణ, సీసీ

## విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు ప్రారంభం



అన్నమాచార్య సంకీర్తనలో భక్తులు, నాయకులు

**కడ్తాల్:** సత్యసాయి మందిరంలో శ్రీ లలితా పరమేశ్వరి యంత్ర విగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవాలు బుధవారం ప్రారంభమయ్యాయి. స్త్రీశక్తి లలితాంబిక బృందం, సాయి మందిర దేవాలయ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో దేవాలయ ప్రవేశం, గోపూజ, గణపతి పూజ, పుణ్యాహవాచనం, రక్ష బంధనం, దీక్షాధారణ, శోడశ స్తంభ పూజ, అఖండ దీపారాధన, అంకురార్పణ, కలశ స్థాపన, అర్చన, హారతి, యాగశాల ప్రవేశం, అగ్ని ప్రతిష్ఠాపన, గణపతి తదితర కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం అన్నమాచార్య సంకీర్తనాచార్యులు, రాష్ట్రపతి సాహిత్య పురస్కార అవార్డు గ్రహీత డాక్టర్ దీక్షితుల సుబ్రహ్మణ్యం పర్యవేక్షణలో అన్నమాచార్య సంకీర్తన ఘనంగా జరిగింది. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ లక్ష్మీనర్సింహారెడ్డి, నిర్వాహకులు ఎలికంటి జ్ఞాన ప్రసూనాంబ శర్మ, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాఘవేందర్, భజన మండలి సభ్యుడు వెంకట్‌రెడ్డి, మోహన్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, శ్రీరాములు, నారాయణ, రాఘవాచారి, శ్రీనివాస్, లలితాంబిక బృందం సభ్యులు పాల్గొన్నారు.

## చదువుతో పాటు క్రీడల్లో రాణించాలి

**కడ్తాల్:** విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని ఎంపీటీసీల సంఘం జిల్లా మాజీ కార్యదర్శి గోపాల్ అన్నారు. బుధవారం మండల పరిధి రావిచేడ్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు క్రీడా సామగ్రి కొనుగోలుకు రూ.11 వేలను ఉపాధ్యాయులకు ఆయన అందజేశారు. అనంతరం గోపాల్ మాట్లాడుతూ.. పాఠశాల అభివృద్ధికి సహకరిస్తానని, విద్యార్థులు క్రీడా సామగ్రిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ రంగయ్య, నాయకులు బీరప్ప, శ్రీశైలం, కృష్ణయ్య, యాదయ్య పాల్గొన్నారు.

## పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యం



రోగులకు మందులు పంపిణీ చేస్తున్న వైద్యులు, నాయకులు

**తలకొండపల్లి:** వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాలను శుభ్రంగా ఉంచుకుంటే.. ఎలాంటి వ్యాధులు సోకవని జెడ్పీటీసీ మాజీ సభ్యుడు ఉప్పల వెంకటేశ్ అన్నారు. మండల పరిధి వెంకట్రావ్‌పేట్‌లో ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ ఉప్పల ఆధ్వర్యంలో బుధవారం ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేయగా.. డాక్టర్ అఖిల్, హైదరాబాద్ కామినేని ఆస్పత్రి సంయుక్తంగా 236 మంది రోగులకు వైద్య పరీక్షలు చేశారు. అనంతరం మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వెంకటేశ్ మాట్లాడారు. వికారం, నీళ్ల విరేచనాలు, కీళ్ల నొప్పులు, నీరసం, దగ్గు, గొంతు నొప్పి, కళ్ల మంటలు, ముక్కు కారడం, శరీరంపై దద్దుర్లు వంటి లక్షణాలు ఉంటే ఏ మాత్రం నిర్లక్ష్యం చేయకుండా.. వైద్యులను సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు హైమావతి, రమేష్, ఈశ్వర్, మాజీ ఎంపీపీ లక్ష్మీదేవి, రఘురాములు, వెంకట్‌రెడ్డి, మైసయ్య, గౌడ సంఘం కల్వకుర్తి నియోజకవర్గ అధ్యక్షుడు అశోక్‌గౌడ్, రాజు, దశరథం, లాల్, భాస్కర్, రాము, అంజయ్య, కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

## భక్తిభావం పెంపొందించుకోవాలి

ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి



విగ్రహ ప్రతిష్ఠాపన వేడుకల్లో ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, భక్తులు

**తలకొండపల్లి:** భక్తితో ముక్తి, మోక్షం లభిస్తుందని, ప్రతి ఒక్కరూ భక్తి మార్గంలో నడుచుకోవాలని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. మండల కేంద్రంలో జెడ్పీటీసీ మాజీ సభ్యుడు ఉప్పల వెంకటేశ్ రూ.15 లక్షలతో పోచమ్మ ఆలయాన్ని నిర్మించారు. ఈ సందర్భంగా ఆలయ నిర్వాహకులు బుధవారం పోచమ్మ విగ్రహ ప్రతిష్ఠ, శిఖర ప్రతిష్ఠాపన, ప్రాణ ప్రతిష్ఠ నిర్వహించారు. అంతకు ముందు ఆలయంలో యజ్ఞ హోమం, అఖండ దీపారాధన, ఆగమ శాస్త్రం ప్రకారం ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కసిరెడ్డి, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు ఉప్పల అమ్మవారిని దర్శించుకొని, పూజలు చేశారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు ఇరువురిని సన్మానించారు. తీర్థ ప్రసాదాలు అందజేశారు. భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమ అనంతరం రూ.5 లక్షలతో నిర్మించిన సీసీరోడ్డును ఎమ్మెల్యే ప్రారంభించారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకుడు, సీనియర్ నేత బాలాజీసింగ్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి, కాంగ్రెస్ కిసాన్ సెల్ రాష్ట్ర కార్యదర్శి మోహన్‌రెడ్డి, డీసీసీ ప్రధాన కార్యదర్శి రవీందర్‌యాదవ్, సోషల్ మీడియా అసెంబ్లీ ఇన్‌చార్జి అజీం, మాజీ సర్పంచ్ లలిత, బ్లాక్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కృష్ణ, సీనియర్ నేత యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

## ‘రుణమాఫీ’పై ఫిర్యాదుల సేకరణ



కొందుర్గు: గుర్రంపల్లిలో సర్వేచేస్తున్న ఏఓ రాజేందర్‌రెడ్డి



రైతుల వివరాలను సేకరిస్తున్న వ్యవసాయాధికారి శంకర్‌లాల్

**చేవెళ్ల:** ప్రభుత్వం విడుదల చేసిన రుణమాఫీ వర్తించని రైతుల వివరాలను సేకరించే పనిలో వ్యవసాయాధికారులు నిమగ్నమయ్యారని మండల వ్యవసాయాధికారి శంకర్‌లాల్ తెలిపారు. మండల కేంద్రంలోని రైతు వేదిక వద్ద రుణమాఫీ కానీ రైతుల ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండలంలో రైతు రుణమాఫీలో అర్హత ఉండి రేషన్‌కార్డు లేని కారణంగా రుణమాఫీ కాని రైతుల వివరాలను ప్రభుత్వం ఇంటింటికీ వెళ్లి పరిశీలించి సేకరించాలని ఆదేశించిందని చెప్పారు. ఇందులో భాగంగా ఈనెల 28వ తేదీ నుంచి వచ్చే నెల 24వ తేదీ వరకు మండలంలోని అన్ని గ్రామాల్లో పర్యటించి రైతుల వివరాలను సేకరిస్తున్నట్లు చెప్పారు. గ్రామాల వారీగా వ్యవసాయాధికారులు ఆయా గ్రామాల్లో పర్యటించే షెడ్యూల్‌ను ప్రకటించినట్లు తెలిపారు. ఈ షెడ్యూల్ ప్రకారం అన్ని గ్రామాల్లో తిరిగి వివరాలు సేకరించి ఉన్నతాధికారులకు నివేదిస్తామన్నారు. ఇప్పటికే రైతు వేదికల వద్ద కూడా ఫిర్యాదులు చేసేందుకు వచ్చిన రైతుల వివరాలను సేకరించామన్నారు. గ్రామాల వారీగా తేదీలు ఇస్తున్నట్లు తెలిపారు. రైతులు సహకరించి వ్యవసాయాధికారులకు తమ వివరాలను తెలియజేయాలన్నారు.

**అర్హులైన రైతులందరికీ రుణమాఫీ**

**కొందుర్గు:** అర్హులైన రైతులందరికీ రుణమాఫీ అందుతుందని జిల్లేడ్ చౌదరిగూడ మండల వ్యవసాయాధికారి రాజేందర్‌రెడ్డి అన్నారు. బుధవారం ఆయన మండలంలోని గుర్రంపల్లిలో ఇంటింటి సర్వే చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండలంలోని అన్ని గ్రామాల్లో వివిధ బ్యాంకుల్లో 2 లక్షలపైన రుణం ఉండి ఇంకా మాఫీ కాని 250 కుటుంబాలను గుర్తించామని వచ్చేనెల 20 వరకు అన్ని కుటుంబాలను సర్వేచేసి ఉన్నతాధికారులకు నివేదిస్తామన్నారు. ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు వచ్చిన వెంటనే 2 లక్షలపైన రుణాలు ఉన్న రైతులు డబ్బులు బ్యాంకుల్లో చెల్లించి రుణ విముక్తులు కావాలని ఆయన సూచించారు.

## గుర్తు తెలియని వ్యక్తులతో జాగ్రత్త



ఆర్టీసీ బస్టాండ్‌లో ప్రయాణికులతో మాట్లాడుతున్న ఎస్‌ఐ సత్యనారాయణ

**యాచారం:** గుర్తు తెలియని వ్యక్తుల పట్ల జాగ్రత్తగా ఉండాలని, ఊరికి వెళ్లేటప్పుడు చోరీలు జరగకుండా పోలీసులకు ముందస్తు సమాచారం ఇవ్వాలని ఎస్‌ఐ సత్యనారాయణ సూచించారు. బుధవారం మండల కేంద్రంలో ఎస్‌ఐ ఆధ్వర్యంలో ఆర్టీసీ బస్టాండ్, అంబేడ్కర్ కూడలి, మొండిగౌరెల్లి చౌరస్తా తదితర కూడళ్లలో పోలీస్ సిబ్బంది సైకిల్ పెట్రోలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. గ్రామాల్లో గుర్తు తెలియని వ్యక్తులు సంచరిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని చెప్పారు. గంజాయి తాగడం, విచ్చలవిడిగా మద్యం సేవించడం, మహిళలను ఇబ్బంది పెట్టే సంఘటనలు జరిగితే ఫిర్యాదు చేస్తే, వెంటనే చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

## పాఠశాల అభివృద్ధికి కృషి

**తలకొండపల్లి:** తాను చదువుకున్న పాఠశాల అభివృద్ధికి కృషి చేస్తానని పూర్వ విద్యార్థి, కాంగ్రెస్ కిసాన్‌సెల్ రాష్ట్ర కార్యదర్శి మోహన్‌రెడ్డి అన్నారు. నిరుపేద విద్యార్థులకు చేయూతనందించి, వారి ఉన్నత చదువులకు సహకారం అందజేస్తామని పేర్కొన్నారు. మండల కేంద్రంలోని జెడ్పీహెచ్‌ఎస్‌లో చదువుకున్న ఆయన.. బుధవారం ఆమనగల్లు లయన్స్ క్లబ్ అధ్యక్షుడు లక్ష్మారెడ్డి చేతుల మీదుగా రూ.50 వేలు విరాళంగా పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఝాన్సిలక్ష్మీకి అందజేశారు. కార్యక్రమంలో లయన్ అంజయ్య, ఓంకారం, జూలూరి రమేష్, శ్రీనివాసురెడ్డి, అంజయ్య తదితరులు పాల్గొన్నారు.



హెచ్‌ఎంకు విరాళం అందజేస్తున్న పూర్వ విద్యార్థి తదితరులు

# ఆదర్శం.. జీవన్‌గూడ పాఠశాల



జీవన్‌గూడ పాఠశాలలో కొత్తగా నిర్మించిన సంపు, ట్యాంకు



పాఠశాలలో శుభ్రంగా తరగతి గది

- అమ్మ ఆదర్శ కమిటీలో అభివృద్ధి పనులు
- విద్యార్థులకు సకల సౌకర్యాలు

**మొయినాబాద్‌రూరల్:** ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మార్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం అమ్మ ఆదర్శ కమిటీల పేరుతో ప్రణాళికను రూపొందించింది. సర్కారు బడులను అభివృద్ధి పథంలో తీసుకెళ్లేందుకే అమ్మ ఆదర్శ కమిటీలో మహిళా సభ్యులను నియమిస్తూ పాఠశాలలో విద్యార్థులకు సమస్యలు లేకుండా సకల సౌకర్యాలు ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తోంది. మండల పరిధిలోని జీవన్‌గూడ పాఠశాలలో అమ్మ ఆదర్శ కమిటీలో ఐదు లక్షల నిధులు కేటాయించారు. అందులో ముందుగా రెండు లక్షలతో అధికారులు పాఠశాలలోని మరుగుదొడ్లకు కావాల్సిన నీటి సంపుతో పాటు పాఠశాలపై నూతనంగా ట్యాంకును ఏర్పాటు చేశారు. అదే విధంగా పాఠశాలలోని గదులలో మరమ్మతులు నిర్వహించి విద్యుత్ కనెక్షన్‌లు, లైట్లు, ఫ్యాన్‌లు, ఏర్పాటు చేశారు. పాఠశాల ఆవరణలో నీరు వృథా పోకుండా ఇంకుడు గుంత నిర్మాణాన్ని చేపట్టారు. పాఠశాలకు కొత్త హంగులు రావడంతో విద్యార్థులు ఎంతో మురిసిపోతున్నారు. పాఠశాల అభివృద్ధిలో అమ్మ ఆదర్శ కమిటీతో పాటు ఉపాధ్యాయులు, అధికారుల కృషితో జీవన్‌గూడ పాఠశాల సకల సౌకర్యాలతో అభివృద్ధిలో దూసుకెళ్తుంది.

**బిల్లులు సకాలంలో ఇవ్వాలి..**



మండల పరిధిలోని పాఠశాలల్లో పనులకు సంబంధించిన బిల్లులు సకాలంలో ఇవ్వాలి. జీవన్‌గూడ పాఠశాలలో ప్రభుత్వ అధికారుల సూచనల మేరకు విద్యార్థులకు అనుగుణంగా అమ్మ ఆదర్శ కమిటీలో తీర్మానించిన అభివృద్ధి పనులు నాణ్యతతో చకచకా నిర్మించాం. పాఠశాలలో విద్యార్థులు చక్కగా చదువుకునే విధంగా ఫ్యాన్లు, లైట్లు బిగించాం. దాదాపు ఇప్పటివరకు రెండు లక్షలకు పైగానే పనులు నిర్వహించాం. కానీ ప్రభుత్వం ద్వారా 50వేల నిధులు మాత్రమే వచ్చాయని ప్రధానోపాధ్యాయులు తెలిపారు. ప్రభుత్వం అమ్మ ఆదర్శ కమిటీ పేరుతో చేపట్టిన పాఠశాలల అభివృద్ధి బిల్లులను వెంటనే చెల్లించాలి.

–కాసాల రాంరెడ్డి, కాంట్రాక్టర్, మొయినాబాద్

**చదువుపై ఆసక్తి పెంచేందుకే..**



ప్రభుత్వం విద్యార్థుల అభివృద్ధికి అమ్మ ఆదర్శ కమిటీని ఏర్పాటు చేసింది. ఈ కమిటీతో పాఠశాలలో ఉన్న సమస్యలు తీరిపోతున్నాయి. విద్యార్థులకు అన్ని సౌకర్యాలతో పాటు నాణ్యమైన విద్యను అందించేందుకు అనేక విధాలుగా కృషి చేస్తోంది. ప్రభుత్వం ద్వారా విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, దుస్తులు, మధ్యాహ్న భోజనంతో పాటు పాఠశాలలో చక్కగా చదువుకునేందుకు అన్ని ఏర్పాట్లు నిర్వహిస్తోంది.

–రమేశ్, హెచ్‌ఎం, జీవన్‌గూడ పాఠశాల